సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 26 । మే । 2023



ప్రాణాలు తీస్తున్న ఈత సరదా!
వేసవి సెలవుల్లో సరదాగా ఈతకు వెళ్తున్న చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. 10 నుంచి 15ఏళ్లలోపు పిల్లలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. - 8లో▸



కేయూను సందర్శించిన న్యాక్ టీం
న్యాక్ టీం సభ్యులు గురువారం కేయూలోని పలు విభాగాలు, కళాశాలలను సందర్శించి పరిశీలించారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $40^0/29^0$
జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎన్టీఆర్ కళారత్న పురస్కారాల ప్రదానం



హన్మకొండ అర్బన్: నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా పలువురికి ఎన్టీఆర్ కళారత్న పురస్కారాలు అందజేశారు. బలగం ఫేం జీవీ బాబు, కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, బి.సుధీర్ బాబు, కొనగంటి కృపాకర్‌రాజు, తాడూరి రేణుక, సవరం రోజీ, రంజితలతో పాటు పలువురికి కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.విజయచందర్‌రెడ్డిల చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. అనంతరం పొట్లపల్లి శ్రీనివాసరావు నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. కార్యక్రమంలో కె.మురళీమోహన్‌రాజు, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.జగన్‌మోహన్‌రావు, సినీ దర్శకులు మహేష్‌చంద్ర, రెడ్ క్రాస్ ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ, దారం కుమారస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల గ్రీవెన్స్ సెల్

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని దివ్యాంగులకు శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి మధురిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాన్నగా గర్వపడుతున్నా...

కుడా చైర్మన్ పుత్రికోత్సాహం



నయీంనగర్: కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ కూతురు అంజలిరాజ్ అమెరికాలోని చెందిన ప్రఖ్యాత స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్) పట్టా అందుకున్నారు. ఈ విషయాన్ని గురువారం సుందర్‌రాజ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. 'నాన్నగా గర్వపడుతున్నా' అంటూ అంజలిరాజ్ పట్టా పొందిన అనంతరం అభినందిస్తున్న చిత్రాన్ని షేర్ చేశారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

30న వాహనాల వేలం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసుల్లో గడువు ముగిసినా వాహన యజమానులు తిరిగి తీసుకెళ్లని 55 ద్విచక్రవాహనాలు, 16ఆటోలు, 03 కార్లను తుక్కు ప్రాతిపదికపై వేలం నిర్వహిస్తున్నట్లు సీపీ ఏవీ రంగనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు సంబంధిత పోలీస్ అధికారుల సమక్షంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు 30న ఉదయం 10 గంటల నుంచి వేలం నిర్వహించే సమయం వరకు వాహనాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 871226 85079 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వసతుల కల్పనకు బడ్జెట్‌పై తీర్మానం

హన్మకొండ చౌరస్తా: జిల్లాలోని ప్రధాన గ్రంథాలయాల్లో కనీస వసతుల కల్పన, నిర్వహణ ఖర్చుల కోసం రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, సెక్రటరీ పద్మజలు తెలిపారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల జీత భత్యాలు, విద్యుత్ బిల్లు, పేపర్ బిల్లు, ఇతర రిపేర్లకు సుమారు రూ.1.50 కోట్ల బడ్జెట్ అవసరముంటుందని తెలిపారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ కమిటీ సభ్యుడు సముద్రాల మధు, డీఈఓ అబ్దుల్‌హై, డీఎల్‌పీఓ భాస్కర్ పాల్గొన్నారు.


టీఎస్‌ఈఈయూ327 రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జశ్వంత్ కుమార్



హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బొద్దిరెడ్డి జశ్వంత్ కుమార్ ఎన్నికైనట్లు యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. జశ్వంత్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

అదరహో.. భద్రకాళి

తిరుమాడ వీధుల అవుట్‌లైన్ చిత్రం



తిరుమాడ వీధులు, గోపురాలు, రోడ్లతో భద్రకాళి దేవాలయం నమూనా, ఆలయ ప్రధాన రాజగోపురం





గర్భాలయంపై వచ్చే గోపురం నమూనా



- ఆలయ అభివృద్ధికి రూ.30కోట్లు విడుదల
- జూన్ 15 కల్లా మాడవీధుల నిర్మాణానికి సిద్ధం

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి ఆలయ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. టెంపుల్ టూరిజం కాన్సెప్ట్‌లో భాగంగా దేవాలయం ప్రాంగణంలో మాడవీధుల నిర్మాణం కోసం కోసం రాష్ట్ర ప్రభుత్వ రూ.30కోట్లు కేటాయించింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.20కోట్లు, కుడా నుంచి రూ.10కోట్ల నిధులు విడుదల చేసింది.

మాడవీధుల నిర్మాణం..
దేవాలయం చుట్టూ నిర్మాణం చేయబోయే చతుష్పాథములనే మాడవీధులు అంటారు. వీటి నిర్మాణ క్రమంలో ఆలయానికి ప్రాకారం నిర్మాణం చేస్తారు. ఈ ప్రాకారానికి నాలుగు దిశలలో నాలుగు ద్వారాలు ఏర్పాటు చేసి గోపురాలు నిర్మిస్తారు. ప్రాకార నిర్మాణంలో భాగంగా దేవాలయం పడమర, దక్షిణం దిశలలో ఉన్న భద్రకాళి చెరువు 60 అడుగులు ముందుకు జరపనున్నట్లు తెలుస్తోంది. ఉత్తరం వైపు ఉన్న వేదపాఠశాల నుంచి ప్రస్తుతం ఉన్న ప్రధానగేటు తూర్పువైపుగా నిర్మించనున్నారు. అమ్మవారికి అభిముఖంగా ఉండే గోపురాన్ని రాజగోపురం అంటారు. దీనిని 120 అడుగుల ఎత్తుతో 9 అంతస్తులుగా నిర్మించతలపెట్టారు. రాజగోపుర నిర్మాణం కోసం రూ.20కోట్లు అంచనా వేశారు. కాకతీయ శిల్ప నైపుణ్యంతో మిగిలిన మూడు గోపురాలను రూ.10కోట్ల అంచనాతో నిర్మించతలపెట్టారు. రాజగోపుర నిర్మాణాలకు దేవాలయ నిధులు, భక్తుల విరాళాలు వెచ్చించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

వివిధ శాఖల సమన్వయంతోనే నిర్మాణం..
మాడవీధుల నిర్మాణంలో బల్దియా, కుడా, రెవెన్యూ, పోలీస్‌తో సహా అన్ని విభాగాల అధికారుల సమన్వయంతోపాటు వాస్తుప్రకారం అర్చకుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటామని ఈఓ శేషుభారతి తెలిపారు. అదేవిధంగా ఎన్ఐటీ కళాశాల ప్రొఫెసర్లతో సాంకేతిక విజ్ఞానాన్ని వియోగించుకుంటామని పేర్కొన్నారు. జూన్ 15 కల్లా పరిపాలన, సాంకేతిక అనుమతులు తీసుకుని టెండర్ల ప్రక్రియ పూర్తవుతాయని చెప్పారు.

ఇల్లు ఒకటి.. ఓట్లు వంద!

12 ఇళ్లల్లో 1,504 ఓట్లు

- 15 ఓట్లకు పైగా ఉన్న ఆవాసాలు 1,693
- 20 ఓట్లకుపైగా ఉన్న 566 ఇళ్లలో 17,514 మంది ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల డబుల్ ఓట్ల తంతు..
- క్షేత్రస్థాయి సర్వేలో విస్తుపోయే వాస్తవాలు..
- తప్పుల తడకగా ఓటర్ల జాబితా
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాగుతున్న వడపోత



సాక్షిప్రతినిధి, వరంగల్:

- హనుమకొండలోని రెండు డివిజన్లలో రెండిళ్ల నంబర్లపై 274 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు.. వేర్వేరు డివిజన్లలో ఉన్న ఆ రెండు ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఒక ఇంట్లో 18, మరో ఇంట్లో 22 మంది ఉన్నారు. మిగతా వారి కోసం ఆరా తీస్తే పనుల మీద వేరేచోటికి వెళ్లారని అక్కడున్న వారు సమాధానం చెప్పారు.
- వరంగల్‌లోని రెండు వేర్వేరు డివిజన్లలోని రెండిళ్ల నంబర్లలో 212 మంది ఉన్నట్లు జాబితాలో వెల్లడైంది. అధికారులు ఆయా ఇంటినంబర్ల ఆధారంగా వివరాలు సేకరించగా మొత్తం 31మంది ఉన్నట్లు తేలింది. మిగతా వారు ఏమయ్యారు? వాస్తవానికి, ఓటర్ల నమోదుకు అంత తేడా ఎలా ఉంది? అన్న విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు.

జిల్లాల వారీగా పదుల సంఖ్యలో ఓట్లు ఉన్న ఇళ్లు ఇలా..

జిల్లా	15 ఓట్లకు పైగా ఉన్న		20కి పైగా ఓట్లున్న		100కు పైగా ఓట్లున్న..	
	ఇళ్లు	ఓటర్లు	ఇళ్లు	ఓటర్లు	ఇళ్లు	ఓటర్లు
జనగామ	210	4105	57	1446	00	00
మహబూబాబాద్	281	7033	126	4345	05	653
వరంగల్	484	9956	130	3793	02	212
హనుమకొండ	491	10108	140	4034	02	274
భూపాలపల్లి	94	2335	40	1375	02	255
ములుగు	133	3568	73	2521	01	110

... ఇలా ఉమ్మడి వరంగల్‌లో 12 ఇళ్లల్లోనే 1,504 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వడపోత మొదలెట్టారు. తెలంగాణ వ్యాప్తంగా తప్పుల తడకగా ఓటర్ల జాబితా ఉందని ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలనుంచి ఫిర్యాదులున్నాయి. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలో 12 ఇళ్లలో 1,504 మంది ఉన్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 100 ఓట్లకు పైగా ఉన్న ఇళ్లతోపాటు 15 నుంచి 20 మందికి పైగా ఉన్న ఆవాసాల్లో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు.

సవాల్‌గా క్షేత్రస్థాయి పరిశీలన..
ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారడంతో క్షేత్రస్థాయి పరిశీలన బూత్ లెవెల్ అధికారులకు సవాల్‌గా మారింది. ఆరేడు మాసాల్లో సాధారణ ఎన్నికలు రానుండగా.. కీలకమైన ఓటరు జాబితాపై దృష్టి సారించిన ఎన్నికల సంఘం ఆరా తీస్తుండడంతో లోపాలు వెలుగు చూస్తున్నాయి. దీంతో తప్పుల్లేని జాబితా తయారు చేసే క్రమంలో ఇప్పటికే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో.. రెండు, ఆపై ఎక్కువ చోట్ల ఓటుహక్కు కలిగిన ఓటర్లను తొలగించారు. ఇదే క్రమంలో ఒకే ఇంటినంబర్‌తో పదులు, వందల సంఖ్యలో ఉండడంతో మరో వడపోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా మొత్తం 27,75,844 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 5న వెల్లడించిన తుది జాబితాలో తప్పులు కుప్పలు తెప్పలుగా జరిగినట్లు గుర్తించిన అధికారులు. ఆ తప్పులను సవరించేందుకు వడబోత ముమ్మరం చేశారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దున మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉండడంతో ఏటా పనుల నిమిత్తం వస్తున్న కూలీలు, బంధువులను ఓటరు జాబితాలో చేర్పించినట్లుగా గుర్తించారు.



ఉమ్మడి వరంగల్‌లో మొత్తం ఓటర్లు, వివరాలు

మొత్తం ఓటర్లు	27,75,844
పురుషులు	13,78,380
మహిళలు	13,97,121
ఇతరులు	343

క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోంది

ఓటర్ల వివరాలపై క్షేత్రస్థాయిలో బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నారు. ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువమంది ఉంటే ఆ వివరాలను సేకరిస్తున్నాం. ఒక్కో ఇంటి నంబర్‌పై కొన్నిచోట్ల 20 నుంచి 100 మందికి పైగా ఉండడంపైనా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం. ప్రజలు బీఎల్‌ఓలకు సరైన వివరాలు చెప్పి సహకరించాలి. త్వరలోనే పరిశీలన పూర్తవుతుంది.
– వాసుచంద్ర, ఆర్డీఓ హనుమకొండ

త్వరలో కలెక్టరేట్‌కు భూమిపూజ..!





సీఎంతో జరిగిన సమావేశంలో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య సీపీ రంగనాథ్

వచ్చే నెలలో మంత్రి కేటీఆర్ పర్యటన?
- ఇప్పటికే ఆజంజాహి మిల్లు కార్మికులకు ప్లాట్లు
- సీఎం కేసీఆర్‌కు వివరించిన కలెక్టర్ ప్రావీణ్య

సాక్షి, వరంగల్: ఆది నుంచి అన్ని బాలారిష్టాలు ఎదుర్కొంటున్న వరంగల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నిర్మాణానికి అన్నీ అడ్డంకులు తొలగిపోయాయి. మార్చి తొమ్మిదిన చేనేత జౌళి శాఖకు చెందిన ఆజంజాహి మిల్లులోని 20ఎకరాల 32 గుంటలను రెవెన్యూ విభాగానికి బదిలీ చేయడం...ఇటీవలే ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆజంజాహి మిల్లు కార్మికులకు మేడిపల్లిలో కుడా అభివద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లను కేటాయించడంతో లైన్ క్లియరైంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో జిల్లాల కలెక్టర్లతో గురువారం జరిగిన సమీక్షలో వరంగల్‌కు సంబంధించిన సమయంలో దీనిపై చర్చ వచ్చినట్లు తెలిసింది. జూన్ నెలలోనే కొత్త భవన నిర్మాణానికి అంకురార్పణ జరగనున్నట్లు, మంత్రి కేటీఆర్ పర్యటన ఉండే అవకాశముందని సమాచారం.

సీఎం సమావేశంలో కలెక్టర్, సీపీ
హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సీఎం కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్‌లు పాల్గొన్నారు. జిల్లా సమీక్షలో పలు అంశాలను వివరించారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తొద్దు

- కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా
- ధర్మసాగర్, వడ్డేపల్లి కేయూ ఫిల్టర్ బెడ్ల పరిశీలన



వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: నగరంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. గురువారం ఆయన బల్దియా అధికారులతో కలిసి ధర్మసాగర్ రిజర్వాయర్, ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ నీటి శుద్ధికరణ కేంద్రం, వడ్డేపల్లి, కాకతీయ యూనివర్సిటీ ఫిల్టర్ బెడ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ఫిల్టర్ బెడ్‌లలో తాగునీటి సామర్థ్యం, రోజు పంపింగ్ అవుతున్న రా వాటర్, శుద్ధీకరణ జరుగుతున్న తీరు, రోజు నీటి సరఫరా ఎంత జరుగుతోంది, డిస్ట్రిబ్యూషన్ లైన్లు, ఎన్ని రిజర్వాయర్ల ద్వారా పంపిణీ, పైప్ లైన్లు, నల్లా కనెక్షన్లు తదితర అంశాలపై ఆరా తీశారు. నీటి సరఫరా వ్యాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. చివరి నల్లా కనెక్షన్ వరకు శుద్ధిచేసిన నీరు అందేలా పర్యవేక్షించాలన్నారు. లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలని ఆదేశించారు. కేయూ ఫిల్టర్ బెడ్ ప్రాంగణంలోని డ్రై వేస్ట్ రిసోర్స్ కలెక్షన్ సెంటర్ ప్రధాన కేంద్రాన్ని కమిషనర్ సందర్శించారు. నగరంలోని 23 సెంటర్ల నుంచి సేకరించిన డ్రై వేస్ట్‌ను ఇక్కడికి తరలిస్తామని నిర్వాహకులు వివరించారు. అనంతరం కాజీపేట సర్కిల్ ఆఫీస్‌లో ఇంజనీర్లతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో ఇంజనీర్లు వర్క్ ఇన్‌స్పెక్టర్లు నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి రోజూ 25 మంది వినియోగదారుల అభిప్రాయాలను తీసుకుని నివేదించాలని, కాల్ సెంటర్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. నీటి సరఫరాపై తనిఖీ వివరాలను యాప్‌లో లేదా గూగుల్ షీట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, ఈఈలు శ్రీనివాస్ రావు, రాజయ్య, శ్రీనివాస్, మిషన్ భగీరథ గ్రిడ్ రామాంజనేయులు, పబ్లిక్‌హెల్త్ ఈఈ రాజ్ కుమార్, డీఈలు రవికుమార్ సంతోష్ బాబు, ఏఈలు ఉన్నారు.

బహుళ అంతస్తుల నిర్మాణ స్థలాల పరిశీలన
బల్దియా పరిధిలోని పలు బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతికి స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా కమిషనర్ ఆయా ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫాతిమా జంక్షన్ వద్ద, ఎన్ఐటీ ఎదురుగా గల చైతన్యపురి ప్రాంతంలో బహుళ నిర్మాణ స్థలాన్ని కమిషనర్ సందర్శించారు. అదేవిధంగా కాజీపేటదర్గా ప్రాంతంలో బహుళార్థక (మల్టీస్టోర్) భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ ధ్రువపత్రం రిలీజ్ కోసం పరిశీలన చేశారు.

సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు ముమ్మర ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: యూపీఎస్సీ ద్వారా ఈనెల 28వ తేదీన జరగనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ -2023 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ సంధ్యారాణి.. అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లలో నిర్వహించే ఈ పరీక్షలకు మొత్తం నాలుగు రూట్స్‌లలో 11 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు అవసరమైన లైసన్ ఆఫీసర్స్, అసిస్టెంట్ లైసన్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, తదితర అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. పరీక్షకు 5035 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ-అడ్మిట్ కార్డు,ఐడీ ప్రూఫ్ వెంట తీసుకురావాలన్నారు. ఇన్విజిలేటర్, విధులు నిర్వర్తించే సిబ్బంది ఎవరూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లొద్దన్నారు. విద్యార్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో యూపీఎస్సీ ప్రతినిధులు దిలీప్‌కుమార్ సింగ్, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, డీసీఓ నాగేశ్వర్‌రావు, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, కలెక్టర్ ఏఓ కిరణ్‌ప్రకాష్, తదితరురలు పాల్గొన్నారు.

నిరసన దీక్షను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్

కాళోజీ సెంటర్: అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 27న హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని లష్కర్ బజార్ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో సంఘం వరంగల్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చేపడుతున్న నిరసన దీక్షలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పి.కుమారస్వామి, టి.లింగమూర్తి, సి.సుజన్‌ప్రసాద్, రవీందర్, రమేశ్, లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: కేజీబీవీల టీచర్ల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో గురువారం వివిధ జిల్లాల కేజీబీవీ టీచర్లతో హనుమకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీ టీచర్లకు భవిష్యత్‌లో సీఎం కేసీఆర్ సహకారంతో మినిమం టైం స్కేల్ ఇప్పించనున్నట్లు హామీ ఇచ్చారు. ఇందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఆ సంఘం టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల పట్టాభి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భాను ప్రసాద్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, కాజీపేట మండల అధ్యక్షుడు దేవిరెడ్డి మాలకొండారెడ్డి, జనరల్ సెక్రటరి శీలం ప్రకాశ్‌బాబు, నల్లబెల్లి మండల అధ్యక్షుడు మహేందర్ మాట్లాడారు. కేజీబీవీల టీచర్ల సంఘం బాధ్యులు జయశ్రీ, శోభ, సునీత, వివిధ జిల్లాల బాధ్యులు ఝాన్సీ, మాధవి, హిమబిందు, శైలజ, రమాదేవి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నా కూతురు మృతికి ఆ.. ఇద్దరే కారణం

- నగరానికి చెందిన భైరిరెడ్డి సందీప్, సంతోష్‌రెడ్డిలపై పోలీసులకు శ్రావణి తండ్రి ఫిర్యాదు
- యూకే నుంచి నగరానికి చేరుకున్న మృతదేహం

ఖిలా వరంగల్: ఉద్యోగ రీత్యా లండన్ (యూకే)కు వెళ్లిన తన కూతురు శ్రావణి (27) ఆత్మహత్యకు స్థానిక శివనగర్‌కు చెందిన భైరిరెడ్డి సందీప్, అతని తండ్రి సంతోష్‌రెడ్డి కారణమంటూ మృతురాలి తండ్రి బస్వరాజు రమేష్ గురువారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతురాలు తండ్రి రమేష్ కథనం ప్రకారం.. వరంగల్ అబ్బనికుంటకు చెందిన శ్రావణి యూకేలోని వెస్ట్‌మిడ్‌ల్యాండ్ రీజియన్ బర్మింగ్‌హామ్ సిటీలో ఉద్యోగం చేస్తోంది. వరంగల్‌లో ఉన్నప్పుడే ఆమెకు శివనగర్‌కు చెందిన భైరిరెడ్డి సందీప్‌రెడ్డి, అతని తండ్రి సంతోష్‌రెడ్డిలతో పరిచయం ఏర్పడింది. సందీప్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుతం భైరిరెడ్డి సందీప్ కెనడాలో ఉద్యోగం చేస్తున్నాడు. పలుమార్లు ఆమెనుంచి అవసరాల నిమిత్తం సందీప్ డబ్బులు తీసుకునేవాడు. ఆ తరువాత శ్రావణి డబ్బులు ఇవ్వకపోవడంతో మన ప్రేమ వ్యవహారం మీ తండ్రికి చెబుతానని బ్లాక్ మెయిలింగ్‌కు దిగాడు. ఇటీవల సందీప్ బ్లాక్‌మెయిల్ ఎక్కువ చేయడంతో డబ్బులు ఇచ్చేందుకు తిరస్కరించింది. దీంతో సందీప్‌రెడ్డి లండన్‌లోని తన వ్యక్తిగత మనుషులను శ్రావణి వద్దకు పంపించడంతో భయానికిలోనై ఈనెల 10వ తేదీన తను అద్దెకుంటున్న గదిలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

రీపోస్టుమార్టం.. కుటుంబ సభ్యులకు అప్పగింత
శ్రావణి మృతదేహం గురువారం యూకే నుంచి వరంగల్ నగరంలోని అబ్బనికుంటలోని ఆమె సొంతింటికి చేరింది. ముందుగా ఎంజీఎం మార్చురీలో మృతదేహానికి వైద్యులు రీపోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టు కోచ్‌గా రఘువీర్



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) జలగం రఘువీర్ రాష్ట్ర బాలికల జట్టు వాలీబాల్ కోచ్‌గా నియమితులయ్యారు. ఈ నెల 28 నుంచి జూన్ ఒకటి వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేశ్‌బాబు, కార్యదర్శి హన్మంత రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కర్ణాటక, పూణే, సికింద్రాబాద్, రాజస్తాన్, కేరళలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో భూకబ్జా

- సీపీని ఆశ్రయించిన బాధితుడు

హసన్‌పర్తి: తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో భూమిని కబ్జా చేసిన ఇద్దరిపై కేసు నమోదు అయింది. పోలీసుల కథనం ప్రకారం.. గోపాలపురానికి చెందిన దూలం రాజేందర్‌కు అదే గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 139లో మూడు వందల గజాల స్థలం ఉంది. ఈ స్థలంపై రియల్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బైరి సురేందర్‌రెడ్డి కన్నుపడింది. వీరిద్దరు గోపాలపురం గ్రామానికి చెందిన ఓ భూస్వామి నుంచి సర్వే నంబర్ 138లో భూమి కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. ప్రస్తుతం 138 సర్వే నంబర్‌లో భూమి లేకపోవడంతో ఏకంగా 139 సర్వే నంబర్‌లో ఖాళీగా ఉన్న భూమిని కబ్జా చేశారు. దీంతో బాధితుడు రాజేందర్ సీపీ రంగనాథ్‌ను కలిసి తన గోడును తెలపగా కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా!

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గొర్రె నిహారిక, సుమన్ దంపతుల కుమారులు గొర్రె రిషి (11), రిత్విక్ (9) మడికొండ రాంపూర్‌లో జరిగిన బంధువుల పెళ్లికి అన్నదమ్ములు వచ్చారు. ఎండవేడి తట్టుకునేందుకు సరదాగా అన్నదమ్ములు కలిసి చెరువువద్దకు ఈతకు వెళ్లారు. లోతైన గుంతలో మునిగి మృత్యువాత పడ్డారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఇద్దరు కుమారులు చెరువులో పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన కరుడుపెల్లి విజయ్‌కుమార్(42) మంచిర్యాల ఈఎస్ఐ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. తన తోడల్లుడి కుమార్తె వివాహం కోసం డాక్టర్ విజయ్‌కుమార్ తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెరుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు విజయ్‌కుమార్ కుమార్తెలు వింధ్యశ్రీ, హిమజలతో పాటు బావమరిది కుమార్తెలతో కలిసి ఊర చెరువులో దిగి మునిగిపోతున్నారు. గమనించిన డాక్టర్ విజయ్‌కుమార్ హుటాహుటిన చెరువులో మునిగిపోతున్న ఇద్దరు పిల్లలను ఒడ్డుకు లాగేసి తాను మాత్రం నీటిలో మునిగి మృతి చెందారు.

- ఖిలా వరంగల్

- నిండుకుండల్లా చెరువులు, గుంతలు
- ఎండవేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసమే పరుగులు
- తల్లిదండ్రులు పిల్లలపై కన్నేసి ఉంచడమే మేలు
- ఈత సరదా ఒకేరోజు ముగ్గురిని మింగేసింది



వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి సెలవుల్లో సరదా కోసం ఈతకు వెళ్తున్న చిన్నారులు మృత్యువాత పడడుతుండటంతో కన్నవారికి పుత్రశోకం మిగిలుతోంది. ఎంతో భవిష్యత్ ఉన్న 10 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. చెరువు, గుంతల లోతు అంచనా తెలియకపోవడంతో గుంతల్లో కూరుకుపోవడంతోనే ఈ ఘటనలు జరుగుతున్నాయి.

ఈత నేర్చుకోవాలనే తపనతో..

గ్రామీణ ప్రాంతంలో చెరువులు, బావులు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు ఉక్కపోత నుంచి ఉపశమనం, వ్యాయామం కోసం చెరువులు, బావుల్లో స్నానాలకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈత కొట్టేందుకు విద్యార్థులు, యువత ఉత్సాహం చూపుతున్నారు. విపరీతమైన ఎండ సమయంలో ఈత కొట్టేందుకు సరదాగా తరలి వెళ్తున్నారు. ఈ సరదా ప్రాణాల మీదకు తెచ్చేలా ఉంటుండటం కలవరపెడుతోంది. ఈత కొట్టే ఉత్సాహంలో నీటిలో ఆడే ఆటలే అక్కడక్కడా మృత్యుగంటలై మోగుతున్నాయి. గురువారం ఒక్కరోజు ఇద్దరు పిల్లలు, ఓ డాక్టర్ తన పిల్లలను కాపాడి తాను నీటిలో మునిగి మృతి చెందారు.

సురక్షితమైన ప్రాంతంలో ఈత నేర్పించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పించాలంటే ఈత కొలనులో శిక్షణకు పంపించాలని, సెలవుల్లో ఇంటి వద్దనే చిన్న చిన్న పనులు చేసేలా ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే వంట పనులు, వ్యవసాయంపై అవగాహన కల్పించాలని, పోటీ పరీక్షలు, రైటింగ్, టైపింగ్, కంప్యూటర్, పెయింటింగ్ వంటి అంశాలపై శిక్షణ పొందే విధంగా చేయాలని పేర్కొంటున్నారు. దీంతో పిల్లలు బయటకు వెళ్లకుండా ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పిల్లలూ గుర్తు పెట్టుకోండి..

ఈత రాని పిల్లలు తప్పకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణలో రబ్బరు ట్యూబ్‌లను కట్టుకొని నీటిలోకి దిగాలి. బావులు, చెరువు గుంతల్లోకి దూకడం వంటివి చేయొద్దు. అనుభవజ్ఞులు ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. హెచ్చరిక బోర్డులున్న చోట అసలు నీటిలోకి దిగరాదు. లైఫ్ జాకెట్లు, బెండుతో తయారు చేసిన వస్తువులను కట్టుకుని మాత్రమే నీళ్లలో దిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

టీఎస్‌ఎంసెట్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం



జి.సాత్విక్ జి.బాలరాజు, ఎ.మణిదీప్‌రెడ్డి, పి.నర్మద

విద్యారణ్యపురి: టీఎస్‌ఎంసెట్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చూపి ప్రభంజనం సృష్టించారు. జి. సాత్విక్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు, జి.బాలరాజు బీపీసీ విభాగంలో 63వ ర్యాంకు, ఎ.మణిదీప్‌రెడ్డి ఎంపీసీ విభాగంలో 70వ ర్యాంకు, పి.నర్మద ఎంపీసీ విభాగంలో 71వ ర్యాంకు సాధించి ఎస్ఆర్ విజయపథాన్ని ఎగురవేశారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి గురువారం తెలిపారు. అలాగే ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన వి.దీక్షిత్‌రెడ్డి 153వ ర్యాంకు, మాకినేని సింగు 254వ ర్యాంకు, బి.నితిన్ 261వ ర్యాంకు, కె.ఆశ్రిత్‌రెడ్డి 278వ ర్యాంకు, వారణాసి సాయి సిద్దార్థ 296వ ర్యాంకు, రేణికుంట్ల ఐశ్వర్య 480వ ర్యాంకు, సిహెచ్ సోనిక 508 వ ర్యాంకు, కె.వీరేష్ 530వ ర్యాంకు సాధించారని వారు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ తమ విద్యాసంస్థల విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామన్నారు. గత 50 సంవత్సరాల్లో పటిష్టమైన ప్రణాళికలతో జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీల్లో విద్యను అందిస్తూ ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని వారు తెలిపారు.

ఎంసెట్ ఫలితాల్లో 'షైన్' విజయకేతనం

హన్మకొండ: ఎంసెట్ ఫలితాల్లో హనుమకొండలోని షైన్ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. తమ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలు సాధించారని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని షైన్ జూనియర్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కేటగిరీలో అరె శ్రీవర్షిణి రాష్ట్ర స్థాయిలో 1,865 ర్యాంకు, డి.శ్రీజ 9,503 ర్యాంకు సాధించారని తెలిపారు. ఇంజనీరింగ్ కేటగిరీలో ఉగ్గె శ్వేత, టి.నిహారిక 5,185 ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు మెడికల్ కేటగిరీలో 20 మంది విద్యార్థులు 75, ఇంజనీరింగ్ కేటగిరీలో 30 మంది 75 పర్సంటైల్ మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగల రమ, మూగల రమేష్, ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



శ్రీవర్షిణిని అభినందిస్తున్న షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్

ఎంసెట్‌లో 'శివాని'కి ర్యాంకులు



ఎ.సుష్మిత ఎం.హారిక వి.భవాని కె.రిషిత టి.కార్తీక్

హసన్‌పర్తి: ఎంసెట్ ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆకునూరి సుష్మిత 1,559వ ర్యాంకు, మంద హారిక (3,186), భవాని వెంగళ (3,307), కె.రిషిత (3,869), ఎస్.అనూహ్య (5,047), టి.కార్తీక్ (5,775), బి.ప్రణతి (7,483), ఎల్. కల్యాణి (7,506), ప్రదీప్ (8,537), సౌమ్య (8,589), సింధూజ (8,678), కావ్యశ్రీ (9,035), అర్చన (9,162), అశోక్ (9,767), రాకేష్ (10,005), లక్ష్మీప్రసన్న (10,029), సాయి జ్యోష్మిత 10,815వ ర్యాంకు సాధించారని కళాశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, రమేష్, మురళీధర్, సురేష్, సంతోష్‌లు అభినందించారు.

'ఏకశిల' విద్యార్థినికి 1,306 ర్యాంకు

హన్మకొండ చౌరస్తా:ఎంసెట్ ఫలితాల్లో హనుమకొండలోని తమ విద్యార్థిని కె. సంధ్యాదేవి మెడికల్ అండ్ అగ్రికల్చర్ కేటగిరీలో 1,306 ర్యాంకు సాధించిందని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరంగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏకశిల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపక సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



కె.సంధ్యాదేవి

కేయూను సందర్శించిన న్యాక్ టీం



గౌరవ వందనం స్వీకరిస్తున్న న్యాక్ టీం చైర్మన్ సుగమ్, తదితరులు

కేయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) టీం సభ్యులు గురువారం కేయూలోని పలు విభాగాలు, కళాశాలలను సందర్శించి పరిశీలించింది. న్యాక్ పీర్ టీం చైర్మన్ ఉత్తరప్రదేశ్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుగమ్ ఆనంద్‌తో పాటు మెంబర్ కోఆర్డినేటర్ బెంగళూరు యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.హనుమంతప్ప, సభ్యులు వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల ఆచార్యులు డాక్టర్ పంకజ్ కె.శ్రీవాత్సవా, డాక్టర్ బులు మహారాణా, డాక్టర్ జయంతి సోన్‌వాల్కర్, డాక్టర్ సారికా శర్మ, డాక్టర్ సుజాత పీలా తొలుత గురువారం 11 గంటలకు క్యాంపస్‌కు చేరుకోగా వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు స్వాగతం పలికారు. అనంతరం పరిపాలన భవనం వద్ద ఎన్‌సీసీ కేడెట్లతో గౌరవ వందనం న్యాక్ టీం స్వీకరించారు. అక్కడ విజిటర్స్ బుక్‌లో న్యాక్ పీర్ టీం చైర్మన్ సుగమ్ సంతకం చేశారు. అనంతరం అకాడమిక్ కమిటీ హాల్‌లో వీసీ రమేశ్ కేయూలో విభాగాలు, కళాశాలలు గత ఐదేళ్లలో చేపట్టిన అకాడమిక్, పరిశోధనల పరంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



స్వాగత నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మూడు బృందాలుగా వీడి..

న్యాక్ టీంలో చైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు ఉండగా మూడు టీంలుగా విడిపోయి క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, బాటనీ, ఫిజిక్స్, మైక్రో బయాలజీ, జియాలజీ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, తెలుగు, ఇంగ్లిష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఆయా విభాగాల అధిపతులు, ఫార్మసీ కళాశాల, విద్యా కళాశాలలో, కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, గణితశాస్త్రం విభాగం ఫిజిక్స్ విభాగాలల్లో అధిపతులు అకాడమిక్, పరిశోధనల పరంగా చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. దూర విద్యాకేంద్రాన్ని కూడా సందర్శించి పరిశీలించారు. అలాగే క్యాంపస్‌లోని లైబ్రరీని సాయంత్రం సందర్శించి నెట్‌వర్క్ పనిచేసే విధానాన్ని పరిశీలించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

క్యాంపస్‌లోని అడిటోరియంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వాగత నృత్యం, కూచిపూడి నృత్యం, పేరిణి, బతుకమ్మ, బోనాలతో నృత్యాలు అలరించాయి.

టీఎస్ ఐసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 8,476 మంది అభ్యర్థులు
- అమలులో ఒక్క నిమిషం నిబంధన
- ఈనెల 26, 27 తేదీల్లో నాలుగు సెషన్లలో నిర్వహణ
- కన్వీనర్ ఆచార్య పి.వరలక్ష్మి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం 2023–2024లో ప్రవేశాలకు గాను ఈనెల 26, 27 తేదీల్లో టీఎస్‌ఐసెట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి గురువారం తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కలిపి 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ఐయాన్ డిజిటల్ జోన్, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంట, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్, మాస్టర్జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, మోక్షిత కంప్యూటర్స్, వశిష్ఠ టెక్నాలజీస్, నర్సంపేటలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలు పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. నాలుగు సెషన్లలో మొత్తం 8,476 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 నుంచి సా యంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రానికి అనుమతించరు. అభ్యర్థులు ఫొటోగుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యం

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్

హన్మకొండ: రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త పని చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆ పార్టీ హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా ఇంచార్జీ వి.మురళీధర్ గౌడ్ జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి జాతీయ నాయకత్వం కార్యాచరణను సిద్ధం చేస్తుందన్నారు. జూన్ 21న మండల స్థాయిలో యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనే విధంగా కేంద్ర ప్రభుత్వ ల బ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గుండె విజయ రామారావు,మాజీ ఎ మ్మెల్యేలు మార్తినేని ధర్మరావు,ఒంటేరు జైపాల్, మొలుగూరి బిక్షపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా క్టర్.కృష్ణప్రసాద్,నాయకులు గురుమూర్తి శివకుమార్, గుజ్జ సత్యనారాయణ రావు, కాచం గురుప్రసా ద్, తాళ్లపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్ గౌడ్


మోదీ పాలనపై నెల రోజుల ప్రచారం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

గీసుకొండ: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనపై జిల్లాలో విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాల్ని ఈనెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు చేపట్టడానికి ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆపార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. రైతులు, నిరుద్యోగ యువతపై రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, అన్ని రంగాల్లో విఫలమైన విషయాలను ఉద్యమ రూపంలో ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ మాధగాని శ్రీనివాసగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వన్నాల శ్రీరాములు, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, బీజేపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు 'ఓరుగల్లు'

హసన్‌పర్తి: ఓరుగల్లు జిల్లా క్రీడలకు పుట్టనిల్లు అని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు వివరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, ఫిజికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకరాచారి, కోచ్ శ్రీధర్, వి.ప్రసాద్, కోచ్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ స్థాయి అంపైర్ కొమ్ము రాజేందర్ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న విద్యార్థినులు

లారీ-బైక్ ఢీ.. ఫర్టిలైజర్ డీలర్ దుర్మరణం

హసన్‌పర్తి: లారీ–బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ ఫర్టిలైజర్ డీలర్ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... నడికుడ మండలం పులిగిల్లకు చెందిన తాళ్లపల్లి విజయ్‌కుమార్(35) స్థానికంగా ఓ ఫర్టిలైజర్ డీలర్. గురువారం వ్యక్తిగత పనుల నిమిత్తం వరంగల్‌కు వచ్చి పనులు ముగించుకుని రాత్రి బైక్‌పై జాతీయ రహదారి మీదుగా పులిగిల్లకు బయల్దేరాడు. బైక్ వంగపహాడ్ సమీపంలోకి చేరుకోగానే వెనుక వైపు నుంచి వస్తున్న లారీ విజయ్‌కుమార్‌పై నుంచి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో విజయ్‌కుమార్ తల పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న ఎస్సై దేశిని విజయ్‌కుమార్ ఘటనస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని వృద్ధురాలు..

మడికొండ: రెడీమిక్స్ వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మడికొండలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మడికొండ గ్రామానికి చెందిన కుక్కల ఎల్లమ్మ(75) గురువారం మధ్యాహ్నం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా పక్కన సైడ్ డ్రెయినేజీ కాల్వ నిర్మాణ పనులు జరుపుతున్న రెడీమిక్స్ వాహనం రివర్స్ తీస్తుండగా వృద్ధురాలిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎల్లమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి మనువడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింగరావు తెలిపారు.